క్లుప్తంగా

తిమ్మాపురం నూకాంబిక హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఎస్.రాయవరం: మేజర్ పంచాయతీ తిమ్మాపురం నూకాంబిక ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు బుధవారం జరిగింది. సర్పంచ్ కర్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు లెక్కించారు. పది నెలలకు గాను మొత్తం రూ.27 వేలు ఆదాయం వచ్చిందని ఉత్సవ కమిటీ సభ్యుడు వంగలపూడి గోవిందు తెలిపారు. ఉగాదికి ముందు వచ్చే అమావాస్య నాడు అమ్మవారి జాతర నిర్వహిస్తామన్నారు.

ఘనంగా నాగన్న తీర్థం



రేలారే రేలా కళాకారులను సత్కరిస్తున్న సిరసపల్లి ఎంపీటీసీ వీరునాయుడు

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లిలో మంగళవారం రాత్రి నాగన్న తీర్థం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా రేలారే రేలా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు ఆలపించిన గీతాలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాకారులను సర్పంచ్ మద్దాల నాగప్పారావు, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, తదితరులు సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. కళలకు పెద్దపీట వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజునాయుడు, జగ్గప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాల్తేరులో 'పొలం పిలుస్తోంది'

పాయకరావుపేట: మండలంలోని పాల్తేరు-1, 2 గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన చేశారు. రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ పథకాల గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి మాగాణులో అపరాలు సాగుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో రాజేష్, వీఏఏ కల్పన, గ్రామ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



కాలువలో పూడిక తీస్తున్న కార్మికుడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో పారిశుధ్యం మెరుగుకు బుధవారం చర్యలు చేపట్టారు. పలు వీధుల్లోని కాలువల్లో పూడిక తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛ గ్రామం కోసం సహకరించాలన్నారు. వీధుల పరిశుభ్రత అందరి బాధ్యతగా పేర్కొన్నారు.

ఆదర్శవంతంగా తోటాడ పంచాయతీ



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న తోటాడ సర్పంచ్ మంగవేణి

మునగపాక: తోటాడ పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ దొడ్డి మంగవేణి కోరారు. బుధవారం తోటాడ పంచాయతీ పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. వార్డుల్లో సమస్యలను గుర్తించి పరిష్కారానికి పాటు పడాలన్నారు. అవసరమైన చోట రహదారులు, కాలువలు నిర్మించడంతో పాటు ప్రజలకు అవసరమైన వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానంగా పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పాయకరావుపేట మెయిన్ రోడ్డు విస్తరణకు ఎన్నికల సమయంలో మంత్రి హామీ

నెలలు గడుస్తున్నా నోరు మెదపకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి



గత టీడీపీ ప్రభుత్వంలో పాయకరావుపేట మెయిన్ రోడ్డు దుస్థితి

అనితమ్మా..! విస్తరణ ఏమైందమ్మా..!

నక్కపల్లి/పాయకరావుపేట: తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పాయకరావుపేట మెయిన్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరిస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. 2014 ఎన్నికల్లో సైతం ఆమె ఇదే హామీ ఇచ్చి నెరవేర్చలేదు. తాజాగా 2024లో అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు పూర్తవుతున్నా మెయిన్‌రోడ్డు విస్తరణ, డబుల్ రోడ్డు నిర్మాణం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందని, అనిత ఇచ్చిన హామీకి ఇంకా ఆరు మాసాలు పూర్తి కాలేదా? అంటూ పట్టణ వాసులు గుసగుసలాడుకుంటున్నారు. 2014లో అనిత ఇచ్చిన హామీని 2023లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చొరవతో రూ.1.95 కోట్లతో కొత్తగా నిర్మించి ప్రజల రహదారి కష్టాలు తీర్చారు. దీన్ని అభినందించాల్సింది పోయి.. సింగిల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు.. తాము అధికారంలోకి వస్తే ఆరు మాసాల్లోనే డబుల్ రోడ్డుగా విస్తరించడమే కాకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని ప్రగల్భాలు పలికారు.

నియోజకవర్గ కేంద్రమైన పాయకరావుపేట మెయిన్ రోడ్డు అధ్వానంగా ఉండేది. నక్కపల్లి, పాయకరావుపేట మండలాల ప్రజలు మార్కెట్‌తో



ఆక్రమణలకు గురవుతున్న పాయకరావుపేట మెయిన్ రోడ్డు

పాటు విద్యా, వైద్య అవసరాల కోసం పాయకరావుపేట రావాల్సిందే. జాతీయ రహదారి వైజంక్షన్ నుంచి గౌతం సినిమా హాలు సెంటరు వరకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం కలిగిన ఈ మెయిన్‌రోడ్డును డబుల్ లైన్‌గా విస్తరించి మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నది పట్టణవాసుల కోరిక.. డిమాండ్ కూడా. తుని, పాయకరావుపేట జంట నగరాలను కలిపే ప్రధాన రోడ్డు కూడా ఇదే. రోడ్డు గతంలో పెద్ద పెద్ద గుంతలతో ఉండి రాకపోకలకు ఇబ్బందయ్యేది. దీనికి తోడు చిల్లర వ్యాపారస్తులు ఇరువైపులా ఆక్రమిం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన పాయకరావుపేట మెయిన్‌రోడ్డు

చుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. గతంలో కాం**గ్రెస్ ప్రభుత్వంలోనే ఈ రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేశారు. ఇంతలో ఎన్నికలు** రావ**డంతో పనులు ప్రారంభం కాలేదు. తర్వాత 2014లో టీడీపీ అధికారంలోకి రావడంతో రూ.4 కోట్లకు అంచనాలు పెంచి నిర్మాణ పనులు వుడాకు** అప్పగించారు. కాంట్రాక్టర్ కొద్దిపాటి పనులు చేసి వదిలేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేసింది. రోడ్డును విస్తరించేందుకు సిద్ధపడితే కొంత మంది టీడీపీ నాయకులు చిల్లర వ్యాపారులతో కోర్టులో కేసులు వేయించి ఆక్రమణదారులకు నష్టపరిహారం చెల్లిస్తే తప్ప విస్తరణ చేయడానికి వీల్లేదంటూ అడ్డుకున్నారు. దీంతో రూ.1.95 కోట్లు కేటాయించి వుడాతో రోడ్డును విస్తరించకుండా పాత రోడ్డు పైనే రెండు కిలోమీటర్ల మేర తారు వేసి నిర్మించారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పాయి. అద్దంలా మెరిసేలా నిర్మించిన ఈ రోడ్డుపై టీడీపీ నాయకులు విమర్శలు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన అనిత తాము అధికారంలోకి వస్తే డబుల్ రోడ్డుగా విస్తరిస్తామని హామీ ఇచ్చారు. ఆరు మాసాలు పూర్తవుతున్నా రోడ్డు విస్తరణపై నోరు మెదపడం లేదు. దీనికి తోడు ఆక్రమణలు విస్తరిస్తున్నాయి. మరికొందరు వ్యాపారులు రోడ్డును ఆక్రమించుకుని వ్యాపారాలు విస్తరిస్తున్నారు. మంత్రి హోదాలో ఉన్న అనిత ఇప్పటికైనా పాయకరావుపేట మెయిన్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరిస్తానన్న హామీని నెరవేర్చాలని, ఆక్రమణలు తొలగించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

జటిలమైన ట్రాఫిక్ సమస్య

రోడ్డును విస్తరించకపోవడంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. చిత్ర మందిర్ జంక్షన్ నుంచి మంగవరం రోడ్డు జంక్షన్ వరకు నిత్యం సాయంత్రం సమయంలో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. ఆటోలు, బస్సులు, స్కూల్ బస్సులు, ద్విచక్ర వాహనాలు, పాదచారులు రాకపోకలకు నరకం అనుభవిస్తున్నారు. పండగ సమయాల్లో అయితే కిలోమీటరు దూరం రాకపోకలకు రెండు గంటల సమయం పడుతోందని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రస్తుతం మెయిన్ రోడ్డు ఆక్రమణలు, విస్తరించకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు

మెయిన్ రోడ్డు విస్తరణ తక్షణ అవసరం



మెయిన్ రోడ్డును విస్తరించకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. గతంలో అధ్వానంగా ఉన్న రోడ్డును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.2 కోట్లతో కొత్త రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. కోర్టులో కేసులు ఉండటంతో విస్తరణకు అడ్డంకి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విస్తరించి డబుల్ రోడ్డు నిర్మిస్తామని, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని మంత్రి అనిత హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఎనిమిది నెలలు పూర్తయింది. ఇప్పటికైనా పాయకరావుపేట మెయిన్ రోడ్డు విస్తరణపై మంత్రి దృష్టిసారించాలి.

– వెలుగుల అర్జునరావు, సీపీఐ, మండల కార్యదర్శి, పాయకరావుపేట

హామీ మరిచినట్టున్నారు?



మెయిన్ రోడ్డును ఆరు నెలల్లోనే విస్తరిస్తామని ఇచ్చిన హామీని మంత్రి అనిత మరిచినట్టున్నారు. గెలిచి ఆరుమాసాలు గడుస్తున్నా ఇంత వరకు దీనిపై ఒక్కసారి కూడా ప్రకటన చేయలేదు. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్డు విస్తరించకపోవడం వల్ల తీవ్ర ట్రాఫిక్ ఇబ్బంది ఏర్పడుతోంది. చిల్లర వ్యాపారులకు న్యాయం చేసి, పరిహారం చెల్లించి రోడ్డు విస్తరణ పనులు తక్షణమే ప్రారంభించాలి. మంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

– జగతా శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి

మార్మోగిన శ్రీరామ నామస్మరణ



ఎం.జగన్నాథపురంలో శ్రీరాముని విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



వాడ్రాపల్లి రామాలయంలో సామూహిక దీపారాధనలో పాల్గొన్న భక్తులు

మునగపాక: వాడ్రాపల్లిలో బుధవారం రాత్రి శ్రీరామ నామస్మరణ మార్మోగింది. పెదరామస్వామి ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. అయోధ్యలో బాల రామున్ని ప్రతిష్టించి ఏడాది కావడంతో సామూహిక హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీరామ నామస్మరణ చేశారు.

జగన్నాథపురంలో శ్రీరాముని విగ్రహ ఊరేగింపు

అచ్యుతాపురం: మండలంలోని ఎం.జగన్నాథపురం గ్రామంలో శ్రీరాముని విగ్రహాన్ని ఊరేగించారు. అయోధ్య రామ మందిర నిర్మాణంలో భాగంగా బాల రాముని విగ్రహాన్ని ప్రతిష్టించి ఏడాది పూర్తయిన సందర్భంగా గ్రామ వీధుల్లో బాల గణపతి భజన బృందం సభ్యులు, సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు భజనలు చేసుకుంటూ స్వామి వారి విగ్రహాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో బంటు రాము, మట్టా సర్వాలక్ష్మి, బంటు ఆనంద్, పీలా శ్రీను, కొమిరెడ్డి బాబ్జి, సేనాపతి కాశీనాయుడు, సేనాపతి పెద్దరాయుడు, బుదిరెడ్డి కన్నకుమార్, పైలా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

గోకులపాడులో ఉచిత పశు వైద్య శిబిరం



పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

ఎస్.రాయవరం: పశువులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయిస్తూ వాటి ఆరోగ్య సంరక్షణ చూసుకుంటేనే పాల ఉత్పత్తి బాగా ఉంటుందని చినగుమ్ములూరు పశువైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. గోకులపాడు గ్రామంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ కర్రి సత్యనారాయణ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. 40 మంది రైతులకు చెందిన 60 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. పలు పశువులకు నట్టల నివారణ మందులు అందజేశారు.

తల్లిదండ్రులపై ప్రేమానురాగాలు చూపాలి

మునగపాక: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులు, వృద్ధుల పట్ల ప్రేమానురాగాలు చూపాలని శ్రీవెంకటేశ్వర గీతా ప్రచార సమితి కన్వీనర్ శరగడం పరదేశినాయుడు కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో మంగళవారం రాత్రి గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో 60 సంవత్సరాలు దాటిన 16 మంది దంపతులకు సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కుటుంబ వ్యవస్థ బలహీనపడుతుందని, తల్లిదండ్రుల పట్ల గౌరవం తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరి దశలో తల్లిదండ్రులను ఎంత బాగా చూసుకుంటే మనకు కూడా మంచి జరుగుతుందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, మళ్ల వరహీ నరసింగరావు, మళ్ల జోగినాయుడు, మళ్ల సంతోష్, యల్లపు అప్పలనాయుడు, శరగడం గణేష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సత్కారం పొందిన దంపతులు

గౌరీపరమేశ్వరులకు మేడ సమర్పణ

మునగపాక: మునగపాకలో బుధవారం రాత్రి గౌరీపరమేశ్వరులకు మేడ సమర్పణ ఘనంగా జరిగింది. మునగపాకకు చెందిన చెరువు కాలువ సంఘ రైతులు తమ వ్యవసాయ క్షేత్రంలో అరటి గెడలు, బెల్లం, చెరకు దుబ్బులు, ఇతర పంటలను సేకరించి ఆలయానికి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. వచ్చేనెల 1న గౌరీపరమేశ్వరుల ఉత్సవం జరగనున్న నేపథ్యంలో సంప్రదాయం ప్రకారం మేడ సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆడారి జగ్గారావు, వెలగా వెంకట్, దాడి చంద్రరావు, దాడి సూరప్పారావు, వెలగా అప్పలనాయుడు, బీవీఎస్ నారాయణ, దాడి అప్పారావు, వెలగా ధర్మసూరి అప్పారావు, వెలగా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



మేడ సమర్పణలో భాగంగా ఊరేగింపు చేస్తున్న చెరువు కాలువ సంఘ రైతులు

29న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మునగపాక: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 29న జరగనుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు పూర్తి స్థాయి నివేదికతో అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

102 జంతువులకు చికిత్స



గొర్రెలకు టీకాలు వేస్తున్న సిబ్బంది

కోటవురట్ల: మండలంలోని అన్నవరం, సన్యాసిరాజుపాలెం గ్రామాలలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను బుధవారం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెట్ల నరేష్ పర్యవేక్షణలో పశువులు, మేకలు, గొర్రెలకు చికిత్స చేశారు. డాక్టర్ నరేష్ మాట్లాడుతూ పాడి పశువులు, గొర్రెలు, మేకలలో ఉత్పాదక శక్తిని పెంచేందుకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరాలు ఈ నెల 31వ తేదీ వరకు జరుగుతాయని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెండు గ్రామాలలో శిబిరాల ద్వారా 102 జంతువులకు చికిత్స చేసినట్టు తెలిపారు. చూడి కట్టని పశువులు 22, కృత్రిమ గర్భధారణ 1, చూడి పరీక్షలు 10, పెద్ద పశువులకు డీ వార్మింగ్ 46, పెయ్యలు డీ వార్మింగ్ 32, మేకలు, గొర్రెలు డీ వార్మింగ్ 75, మేకలు, గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు 52, 112 కోళ్లకు వ్యాక్సినేషన్ వేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తంగేడు పశు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పు గల్లీల నిర్వహణకు వేలం వేయరా?



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ అప్పలరాజు

ఎస్.రాయవరం: రేవుపోలవరం సమీపంలో ఉప్పు గల్లీల లీజు గడువు ముగిసినా.. వేలం నిర్వహించకపోవడం దారుణమని వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు ధ్వజమెత్తారు. అడ్డురోడ్డు జంక్షన్‌లో బుధవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉప్పు పరిశ్రమ ఉందని, ఆ గల్లీ నిర్వహణ దశాబ్దాలు కాలంగా ఒకే కుటుంబానికి చెందిన వారు చేస్తున్నారన్నారు. సుమారు 384 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమిలో కొంత మేర ఉప్పును పండిస్తున్నారన్నారు. 2021 నాటికి లీజు ముగిసినప్పటికీ మళ్లీ వేలం నిర్వహించకుండా పాత వ్యక్తులతోనే సాగు చేపడుతున్నారని ఆరోపించారు. దీనిపై కోర్టులో పిటిషన్ వేశామన్నారు. రెండు నెలలు కాల వ్యవధి ఇచ్చి వేలం నిర్వహించాలని కోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. ఆ గడువు ఈ నెల 8వ తేదీతో ముగిసిందన్నారు. కోర్టు ఆదేశాలను కూడా ధిక్కరించి పనులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. జిల్లా కలెక్టర్ దృష్టి సారించి ఉప్పు పరిశ్రమ నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని కోరారు.

ఘనంగా లాలం కోడూరు తీర్థం



ఉత్సాహంగా జరుగుతున్న వాలీబాల్ పోటీలు

రాంబిల్లి(యలమంచిలి): మండలంలో లాలం కోడూరు గ్రామంలో లాలం ఎరికిరెడ్డి నాయుడు, ఆదమ్మ దంపతుల తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. అనకాపల్లి జిల్లా పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు ఈ ఉత్సవంలో సందడి చేశారు. పరస సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. తీర్థంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల కోలాటం, తోడపెద్దు సేవ, సాము గరిడీలు, తప్పెటగుళ్లు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

కంటి ఆపరేషన్లకు 30 మంది ఎంపిక

కోటవురట్ల: సుంకపూరు గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ చిటికెల కాశీలక్ష్మి ప్రారంభించగా.. ఆప్తాలమిక్ ఆఫీసర్ జాక్సన్ కంటి పరీక్షలు చేశారు. క్యాంపు కో ఆర్డినేటర్ సిహెచ్.అశ్వినికుమార్ మాట్లాడుతూ 53 మందికి కంటి పరీక్షలు చేయగా.. 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. వారిని విశాఖలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లాలం సన్యాసినాయుడు, గ్రామ పెద్దలు సింగంపల్లి బాబులు, సింగంపల్లి శ్రీనివాసు, లాలం లచ్చాపాత్రుడు, లాలం బాబులు, నర్సింగ్ స్టాఫ్ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.



సుంకపూరులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వైఎస్సార్‌సీపీలో కష్టపడిన వారికి గుర్తింపు

- పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్
- ఘనంగా మాజీ మంత్రి అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు



అమర్‌నాథ్ జన్మదిన వేడుకల్లో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్


మునగపాక: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మునగపాక బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో బుధవారం మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు విసుగు చెందారన్నారు. ప్రజల్లో మాజీ సీఎం జగన్‌కు ఆదరణ తగ్గలేదన్నారు. యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, పలువురు సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: అమర్‌నాథ్ జన్మదినం సందర్భంగా పట్టణంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మాజీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి(యలమంచిలి): అమర్‌నాథ్ జన్మదినం సందర్భంగా స్థానిక కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలో అనాథలకు యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మునగపాక మండల అభివృద్ధికి సహకరించాలి

మునగపాక: మునగపాక మండల అభివృద్ధికి సభ్యులు సహకరించాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. మండల పరిషత్ హాలులో బుధవారం సాయంత్రం ఎంపీటీసీలతో ఆమె బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేటాయించిన నిధులను సకాలంలో వినియోగించి గ్రామాలాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలన్నారు. అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి పాటుపడాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఉపాధ్యక్షురాలు చిందాడ దేవి, ఎంపీటీసీలు మద్దాల వీరునాయుడు, మళ్ల కాశీ సురేష్, కాండ్రేగుల కిరణ్‌కుమార్, పాలిపిని శ్రీనివాసరావు, శరగడం అప్పలనరసమ్మ, కాండ్రేగుల వెంకటలక్ష్మి, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రాంబిల్లి(యలమంచిలి): పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాంబిల్లి పశువైద్యాధికారి రఘునాథరావు కోరారు. బుధవారం మండలంలో కుమ్మరాపల్లి, రజాల గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. కుమ్మరాపల్లిలో 54, రజాల గ్రామంలో 59 పశువులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి, నట్టల నివారణ, గర్భకోశ వ్యాధి నివారణ మందులను పాడి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు ఏవిధమైన ఆరోగ్య సమస్యలు ఉన్నా వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మాధురి, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో దుప్పట్లు, పండ్ల పంపిణీ

రాంబిల్లి(యలమంచిలి)/అచ్యుతాపురం: యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కొత్తపాలెంలో ఎక్స్ ఎల్ కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం 60 మంది నిరుపేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కంపెనీ చైర్మన్ అశ్వన్ ష్రాఫ్ జన్మదినం సందర్భంగా జనరల్ మేనేజర్ అజయ్‌పాసే, హెచ్‌ఆర్ రాజవేణి చేతుల మీదగా వీటిని అందజేశారు. అలాగే అచ్యుతాపురం మండలంలోని తంతడి బీచ్‌లో ఎక్సెల్ కంపెనీ ఉద్యోగులు పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ మురళీ ఆధ్వర్యంలో తీరంలో డస్ట్‌బిన్లను ఏర్పాటు చేశారు.